

సోమలలో వీడని మంచు



సదుంలో కమ్ముకున్న పొగ మంచు

డీఈవోగా రాజేంద్రప్రసాద్



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా కె.రాజేంద్రప్రసాద్ నియమితులైయారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం డైట్‌లో సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తుండగా ఎఫ్ఏసీ కింద డీఈవోగా ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడి డీఈవో బి.వరలక్ష్మి ఇప్పటికే కార్వేటినగరం డైట్ (ఎఫ్ఏసీ)లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ఈమెను డైట్ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమించారు.ఈమె నెలాఖరున రిటైర్ కానున్నారు.



అమ్మో...చలి!

పల్లెసీమల్లో సాయంత్రం 5గంటల నుంచే చలి తీవ్రత కన్పిస్తోంది. రాత్రివేళ దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. ఉదయం 9గంటలు దాటినా మంచు తెరలు వీడకపోవడంతో వృద్ధులు, పాఠశాలలకు వెళ్లాల్సిన పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. టమోటా తోటల్లో మంచు ప్రభావంతో చీడ పీడలు అధికంగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలు గుర్తించే లోపు ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ప్రకృతి ప్రేమికులు మాత్రం పొగ మంచును ఆస్వాదించారు.

\- సోమల/సదుం, ఆంధ్రజ్యోతి

వారసులకు ఊరట

రూ.వందకే వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్

ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షలు దాటితే రూ.1000

వైసీపీ బాదుడు నుంచి రైతులకు భారీ ఊరట



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వారసత్వ వ్యవసాయ భూములకు కుటుంబ సభ్యుల మధ్య భాగపరిష్కార ఒప్పందాల రిజిస్ట్రేషన్ ఫీజుల విషయంలో ప్రభుత్వం సమూల మార్పులు తెచ్చింది.2021లో వైసీపీ ప్రభుత్వం విధించిన బాదుడు నుంచి రైతులకు విముక్తి కల్పించింది. ఇకపై ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షల లోపుంటే స్టాంపు డ్యూటీగా రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. రూ.10లక్షలకు పైన ఉంటే రూ.1000 చెల్లించాలి. ఇది వ్యవసాయ భూములకు మాత్రమే. తమ ఆస్తులకు విలువ రాయకుండా కుటుంబ పెద్ద మరణిస్తే, ఆయన ఆస్తులను భార్య, పిల్లలు భాగపరిష్కారం చేసుకుంటారు. ఇలాంటి కేసులకే ప్రస్తుత ఉత్తర్వులు వర్తిస్తాయి. ఈనెల 5న ఇందుకు సంబంధించి జీవోఎంఎస్ నెం. 478 జారీ అయింది.

వేగంకానున్న ప్రక్రియ

కుటుంబసభ్యుల మధ్య భాగపరిష్కారానికి ప్రభుత్వం ఊరట కల్పించడంతో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లు వేగవంతం కానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రైతులు వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆటో మ్యుటేషన్ జరగనుంది. వారికి పట్టాదారు పాసుపుస్తకాలతో పూర్తిహక్కులు వస్తాయి. ముందు రోజుల్లో రిజిస్ట్రేషన్లు పెరగనున్నాయని అధికారులు భావిస్తున్నారు.

ఇంటెస్టేట్ మరణాలకే వర్తింపు



తమ ఆస్తులకు వీలునామా రాయకుండా (ఇంటెస్టేట్) కుటుంబ పెద్ద మరణిస్తే, ఆయన ఆస్తులను భార్య, పిల్లలు భాగపరిష్కారం చేసుకుంటారు. ఇలాంటి కేసులకే ప్రస్తుత ఉత్తర్వులు వర్తిస్తాయి. అదీ వ్యవసాయ భూములకు మాత్రమే. కొత్త విధానంపై ప్రభుత్వం ఈనెల 5న జారీచేసిన జీవోలో పూర్తిస్థాయి విధివిధానాలు అందాయి. వీటిని జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్లకు పంపాం.

\- వెంకటరమణమూర్తి, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు

వైసీపీ సర్కారుకు ముందు ...తరువాత

వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూములను కుటుంబసభ్యులు భాగపంపిణీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే ... రిజిస్ట్రేషన్ విలువలో అధిక విలువ గల ఒక సభ్యుడి వాటాకు మినహాయింపు లభించేది. మిగిలిన ఇద్దరి వాటాకు రిజిస్ట్రేషన్ విలువపై ఒక శాతం స్టాంపు డ్యూటీ వసూలు చేసేవారు. కుటుంబ సభ్యుల్లో మేజర్ విలువ కలిగిన వ్యక్తి ఆస్తికి మినహాయింపు ఇచ్చి మిగిలిన ఇద్దరి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువపై స్టాంపు రుసుము వసూలు చేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2021లో వారసత్వ ఆస్తిని కుటుంబ సభ్యుల్లో ఒకరు ఎక్కువ, మిగిలినవారు తక్కువ తీసుకుంటే... ఎక్కువగా పొందిన విలువపై మూడు శాతం స్టాంపు రుసుము వసూలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. భాగస్వాముల ఆస్తుల రిజిస్ట్రేషన్ బాదుడుతో చిన్న, సన్నకారు రైతులపై అధిక భారం పడింది. దీంతో చాలామంది గత మూడేళ్ళకాలంలో రిజిస్ట్రేషన్లకు ముందుకు రాలేదు. వెబ్‌ల్యాండ్‌లో ఇప్పటికీ మెజార్టీ పట్టాలు మృతుల పేర్లతోనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్ రుసుము భరించలేక చిన్న, సన్నకారు రైతులు రూ.100 స్టాంపు పత్రంపై ఒప్పందాలకే పరిమితమయ్యారు. దీంతో భూముల మ్యుటేషన్ నిలిచిపోయింది. పట్టాదారు పాసుపుస్తకాలు రావడంలేదు. దీంతో తరచూ సివిల్ వివాదాలు తలెత్తుతున్నాయి. ఆస్తి అమ్మినప్పుడు కుటుంబసభ్యులంతా వచ్చి సంతకాలు చేయాలి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు ఇవ్వాలి. తమ స్వాధీనంలోనే భూములున్నా, దాని రిజిస్ట్రేషన్ విలువపై మళ్ళీ మూడు శాతం, ఒక శాతం చొప్పున స్టాంపు రుసుము ఎందుకు చెల్లించాలన్నదే రైతుల ప్రశ్న.



ప్రమాదంలో నుజ్జయిన కార్లు

అతివేగానికి ముగ్గురు బలి

- తడుకుపేట వద్ద ఢీకొన్న కార్లు
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

నగరి, డిసెంబరు 9(ఆంధ్ర జ్యోతి): నగరి మండల పరిధిలో మంగళవారం ఉదయం 8.45 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు...తిరుచానూరు సమాజం వీధికి చెందిన శంకర్ సుబ్రహ్మణ్యం(50) పద్మావతీ దేవి ఆలయంలో పోటు వర్కర్‌గా పనిచేస్తుంటాడు.వసుంధర నగర్‌కు చెందిన ఎస్.సంతానం(38) ఆలయంలోనే ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పోటు వర్కర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరు మంచి స్నేహితులు.ప్రతి మంగళవారం తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లేవారు. ఈ క్రమంలోనే మంగళవారం శంకర్, సంతానం కారులో తిరుత్తణికి బయలుదేరారు. నగరి మండల పరిధిలోని వీకేఆర్ పురం- తడుకుపేట మధ్య చెన్నై నుంచి తిరుమలకు వస్తోన్న కారును మితిమీరిన వేగంతో వీరి కారు ఢీకొంది.దీంతో తిరుచానూరు నుంచి వెళుతోన్న వ్యాగనార్ కారు రోడ్డుకు అవతల ఉన్న లోతట్టు ప్రాంతంలో ఎగిరి పడిపోగా చెన్నై నుంచి వస్తోన్న షిఫ్ట కారు రోడ్డుపైనే ఆగిపోయింది.ఈ ప్రమాదంలో చెన్నైలోని మేడంబాకం ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్(40), తిరుచానూరుకు చెందిన సంతానం, శంకర సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందారు. అరుణ్‌కుమార్ భార్య తమిళ సెల్వి(36), మేనల్లుడు మదన్(40), కుమారుడు యశ్వంత్(11) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పోలీసులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించాక చెన్నైలోని తాంబరం ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ తుషార్ డూడి, డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ప్రమాద కారణాలను సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ నాయక్‌లను అడిగి తెలుసుకున్నారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి కారణమని, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓ వైపు తిరుపతి వాహనాలు, మరో వైపు తిరుత్తణి వాహనాలు వెళ్లేలా చూడాలన్నారు.నగరి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం తరువాత మృతదేహాలను బంధువులకు పోలీసులు అప్పగించారు. మంగళవారం సాయంత్రానికి సంతానం, శంకర సుబ్రహ్మణ్యం మృతదేహాలు తిరుచానూరుకు చేరుకోగా టీటీడీ ఉద్యోగులు నివాళులర్పించారు.



→ మృతులు శంకర సుబ్రహ్మణ్యం, సంతానం (ఫైల్ ఫొటోలు)



ప్రమాద కారణాలను ఎస్పీకి వివరిస్తున్న సీఐ మల్లికార్జునరావు

నేటినుంచి ఐదు కేంద్రాల్లో టెట్ పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈనెల 2 వరకు టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 8,597 మంది ఈ పరీక్షలు రాయనున్నారు.కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే పరీక్షల కోసం జిల్లాలో ఐదు ఇంజనీరింగు కళాశాల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. చిత్తూరు-తిరుపతి రోడ్డులోని ఆర్‌వీఎస్ నగర్‌లో వున్న ఎస్వీ సెట్, చిత్తూరు సమీపం మురకంబట్టు వద్ద వున్న సీతమ్స్, పూతలపట్టు మండలం పి.కొత్తకోటలోని వేమూ కళాశాల, పలమనేరు సమీపంలోని మదర్ థెరిసా కళాశాల, కుప్పంలోని కుప్పం ఇంజనీరింగ్ కాలేజి కేంద్రాల్లో రోజూ రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందు చేరుకోవాలని డీఈవో వరలక్ష్మి కోరారు.

ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నికలు 13న

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 13న సంఘ భవనంలో జరుగనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా శ్యాంసుందర్ శ్రీనివాస్, ఎన్నికల పరిశీలకుడిగా జగదీశ్వరరావు నియమితులయ్యారు.జిల్లాలోని ఆరు తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరవ్వాలని ఎన్నికల అధికారి కోరారు.

గ్రామీణ రోడ్ల మరమ్మతులకు రూ.75.93 కోట్ల మంజూరు

చిత్తూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ రోడ్ల మరమ్మతులకు రూ.75.93 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు చాలా వరకు ధ్వంసమయ్యాయి. జిల్లాలో 152 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న 71రోడ్లను మరమ్మతు చేయడానికి ఈ నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

20.30 గంటలు.. 203 కిలోమీటర్లు


GENIUS Book OF RECORDS
Certificate
NONSTOP 200 KM BLIND SKATING FOR A NOBLE CAUSE
This is to certify that
M. Harsha Vardhan, S/o M. Mani Babu, (Born on 2nd March, 2015) From Tirupati, Andhra Pradesh, India, has achieved a remarkable milestone by blind skating non-stop for a distance of 200 km And Artistic Multi Task. This exceptional accomplishment was undertaken to raise awareness for Children's Responsible Mobile Usage, Eye Donation for Blind Children, and the campaign to Say No to Drugs. The feat was completed under the expert guidance of Coach G. Prathap (Talent Skating Academy) Skating Starts From Nangali Checkpost, via Chittoor, Trupati, Sri kalahasthi, to puttur(END) on 8th December 2025. This achievement has been officially entered in the International Genius Book of Records.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు ధ్రువపత్రం

స్కేటింగ్‌లో అంధ విద్యార్థి రికార్డు

తిరుపతి(క్రీడలు)/వడమాలపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కంటి చూపులేదు. కానీ స్కేటింగ్‌లో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. 20.30 గంటల్లో 203 కిలోమీటర్లు స్కేటింగ్ చేశాడు. సోమవారం ఉదయం చిత్తూరుజిల్లా నంగిలిలో మొదలైన స్కేటింగ్ యాత్ర.. గంటకు దాదాపు 15 కిలోమీటర్ల వేగంతో సాగింది. మధ్యలో మూడుసార్లు బ్రేక్ తీసుకున్నాడు. ఇలా మంగళవారం వేకువజామున 2.30 గంటలకు వడమాలపేట మండలంలోని ఎస్వీపురం టోల్‌ప్లాజా గమ్యస్థానానికి హర్షవర్ధన్ చేరుకున్నాడు. మంగళవారం తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. హర్షవర్ధన్ యాత్రను ప్రత్యక్షంగా రికార్డుచేసిన న్యాయనిర్ణేతలు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఏపీ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, జీనియస్ బుక్ ఆఫ్‌రికార్డ్ నుంచి శ్రీనివాసరావు, విశ్వచంద్రారెడ్డి, వజ్రవరల్డ్ రికార్డ్ నుంచి పి.హరిణి ద్వారా ఆ బాలుడికి పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు. మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కాపుకార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ, తిరుపతి, చిత్తూరు డీఎస్‌డీవోలు శశిధర్, ఉదయ్‌భాస్కర్, స్కేటింగ్ కోచ్‌లు ప్రతాప్, ప్రేమ్‌నాథ్, శాప్ కోచ్‌లు లక్ష్మీకరుణ, చక్రవర్తి, హిందూజ, వినోద్, నాగరాజు, గోపీ, సాయిసుమతి తదితరులు పాల్గొన్నారు.


పతకాలు, ధ్రువపత్రాలు అందుకుంటున్న హర్షవర్ధన్

తిరుపతి- షిర్డీ వీక్లీ రైలు ప్రారంభం



తిరుపతి (సెంట్రల్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి, సాయినగర్ షిర్డీ.. ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య అనుసంధానం పెరిగేలా, భక్తుల సౌకర్యార్థం వీక్లీ రైలును ప్రారంభించారు. ఢిల్లీ నుంచి మంగళవారం కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న వర్చువల్‌గా ప్రారంభించగా, తిరుపతి ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు. అదే సమయంలో తిరుపతిలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దనరెడ్డి, రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ సభ్యుడు జి.భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, తుడా మాజీ ఛైర్మన్ జి.నరసింహయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, రైల్వే సీఈ సూర్యనారాయణ, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, డిప్యూటీ సీఈ వామనమూర్తి, సీపీఆర్వో ఎ.శ్రీధర్, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప రెడ్డి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రానికి ఎన్నో రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నామని, ప్రధానంగా విజయవాడ- గూడూరు మధ్య మూడో రైలు మార్గం పనులు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి సోమన్న వెల్లడించారు. తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు రూ.312 కోట్లతో జరుగుతున్నాయని రాష్ట్ర మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్, గూడూరు-రేణిగుంట మూడవ లైను, నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గాల పనులు జరుగుతున్నాయని వివరించారు.

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 16 ఏళ్ల విద్యార్థినిపై ర్యాపిడో ఆటో డ్రైవరు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. అనంతపురానికి చెందిన ఆ విద్యార్థిని తిరుపతి నగరం భవానీనగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. ఇటీవల ఆమె హాస్టల్ మారారు. పుస్తకాలు, చిన్న చిన్న పాత్రలు తీసుకెళ్లేందుకు ర్యాపిడో ఆటో బుక్ చేసుకుంది. ఆన్‌లైన్‌లో ఆమె మొబైల్ నెంబరు కర్నూలుకు చెందిన ఆటో డ్రైవర్ సాయికుమార్ (ప్రస్తుతం తిరుపతిలో) వద్ద సేవ్ అయింది. దీంతో అతడు ఆమెకు పలుమార్లు ఫోను చేశాడు. కొంత కాలంగా వీరి మధ్య పరిచయం పెరగింది. తనకు అత్యవసరమై ఆమె ఆటో డ్రైవర్‌ను డబ్బు అడిగింది. దీనిని అవకాశంగా తీసుకున్న ఆటో డ్రైవర్.. ఆమెను మభ్యపెట్టి తన గదికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ నెల 2న సాయంత్రం ఫోన్ చేసి భవానీనగర్ సర్కిల్‌కు రమ్మని చెప్పాడు. ఆమెను ఆటోలో శివారు ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని అతడు బెదిరించడంతో ఆమె భయపడి ఎవరికీ చెప్పలేదని పోలీసులు అంటున్నారు. చివరకు ఈ ఘటనపై తన స్నేహితురాలితో కలసి సోమవారం రాత్రి బాధితురాలు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద నిందితుడు సాయికుమార్‌పై అలిపిరి సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు. అతడి ఆటో నెంబరు కోసం ఆమెకు సంబంధించి పాత, కొత్త హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ఎస్పీ సుబ్బరాయుడు మూడు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. ఆ రోజు నుంచి నిందితుడు మొబైల్ ఫోన్ ఆఫ్ చేయడంతో ఆచూకీ గుర్తించడం కొంత కష్టంగా మారింది. వీలైనంత త్వరలో అతడిని పట్టుకుంటామని సీఐ రాంకిషోర్ చెప్పారు.

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్టు

- సంస్కృత వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో పురోగతి
- ఒడిశాలో బాధితురాలి వాంగ్మూలం నమోదు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మణకుమార్, డాక్టర్ శేఖర్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి వాగ్మూలం నమోదు చేశారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణకుమార్ ఇటీవల తన ఆఫీసు గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే విభాగంలోని మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.శేఖర్‌రెడ్డి సంఘటనకు సంబంధించి ఫొటోలు, వీడియో తీసి ఆ విద్యార్థినిని బ్లాక్ మెయిల్ చేశాడు. దీనిపై వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా డీఎస్పీ భక్తవత్సలంను ఎస్పీ సుబ్బరాయుడు నియమించారు. ఇక, వెస్ట్ సీఐ మురళీమోహన్, అలిపిరి ఎస్ఐ అజిత, మరో నలుగురు మహిళా కానిస్టేబుళ్ల బృందం రెండు రోజుల కిందట ఒడిశా వెళ్లి.. బాధితురాలి వాగ్మూలం రికార్డు చేశారు. మరోవైపు ఘటనా స్థలం పరిశీలన, సేకరించిన ఆధారాలు, సాక్షుల వాగ్మూలం ఆధారంగా కేసులో అదనంగా బీఎన్ఎస్ సెక్షన్లు 63,68 కింద చేర్చారు.


లక్ష్మణ కుమార్ - ఎ.శేఖర్‌రెడ్డి

స్క్రబ్‌టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వ్యాధి నివారణ, చికిత్సపై ఆరోగ్యశాఖ అధికారులతో మంగళవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. స్క్రబ్ టైఫస్ చిగ్గర్‌మైట్ అనే పురుగు ద్వారా వస్తుందని తెలిపారు. ఇది పొలాలు, గడ్డి ప్రాంతాలు, పశువుల పాక వంటి చోట్ల ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు. కాటు వేసిన చోట నల్లమచ్చ ఉంటుందని, ఐదు రోజులకు మించి జ్వరం తలనొప్పి, ఒళ్లు నొప్పులుంటే చికిత్సలు పొందాలన్నారు. జిల్లాలో అనుమానిత కేసులు నమోదైన వెంటనే రాపిడ్ రెస్పాన్స్ టీం స్పందించి అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రాపిడ్‌టెస్టులు నిర్వహించి రక్త నమూనాలను సేకరించి నిర్ధారణ కోసం రుయా, స్విమ్స్‌కు పంపించాలని ఆదేశించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్‌వ్యాధి వ్యాప్తి నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాపాడబోయి..

- నీట మునిగి ఆమెతో పాటూ ప్రాణాలు కోల్పోయాడు


మృతి చెందిన గుణశేఖర్ - అంకమ్మ

నారాయణవనం, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని కాపాడబోయి.. చివరకు ఆమెతో పాటు ఆ వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన మంగళవారం నారాయణవనం మండలంలోని తిరువట్యం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరి మండలం గుండ్రాజుకుప్పానికి చెందిన గుణశేఖర్(42) తిరువట్యంలో తన బంధువు దహనక్రియలకు వచ్చారు. సాయంత్రం ఈయన ఇంటికి వెళ్తుండగా.. అదే సమయంలో తిరువట్యం కాజ్‌వే వద్ద నారాయణవనం రజక కాలనీకి చెందిన అంకమ్మ(72) దుస్తులు ఉతుకుతూ నీటిలో పడిపోయింది. దీనిని గమనించిన గుణశేఖర్ ఆమెను కాపాడేందుకు నదిలో దూకడంతో, ఊపిరాడక చనిపోయాడు. వృద్ధురాలూ మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్తుండగా ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న ఆటో
- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు


లావణ్య (ఫైల్‌ఫొటో)

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే వెళ్తే డాక్టర్ దగ్గర ముందుగానే చూపించుకుని తిరిగొచ్చేయచ్చని, తరువాత పనులకు వెళ్లొచ్చని బయలుదేరిన దంపతులు ప్రమాదానికి గురయ్యారు. భార్య అక్కడిక్కడే మృతి చెందగా, భర్త తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన కోట మండలం చిట్టేడు, కేశవరం గ్రామాల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. కోట మండలం గూడలి అరుంధతీయవాడకు చెందిన ధనరాశి మల్లికార్జున్, లావణ్య దంపతులకు వివాహమై 13 సంవత్సరాలు అవుతోంది. వీరికి పిల్లలు లేకపోవడంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయాన్నే డాక్టర్ దగ్గరకు వెళ్దామని మల్లికార్జున్, లావణ్య దంపతులు బైక్‌పై గూడూరుకు బయలుదేరారు. చిట్టేడు - కేశవరం గ్రామాల నడుమ వెళ్తుండగా గూడూరు నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో లావణ్య(28) అక్కడికక్కడే మృతి చెందింది. మల్లికార్జున్ నడుం, భుజం, తలకు బలమైన గాయాలయ్యాయి. ఆటో నడుపుతున్న గూడూరుకు చెందిన అబ్బాస్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్‌ఐ పవన్‌కుమార్ సంఘటనాస్థలికి చేరుకున్నారు. రోడ్డుపై ఉన్న లావణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మల్లికార్జున్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.


తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్

ముంపు బాధితులను ఆదుకుంటాం: కలెక్టర్

కేవీబీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు చెరువు ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. కళత్తూరులో ముంపు బాధితులకు రూ.1.21 కోట్లు, రూ.42,20,000 కు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు మైక్ అందించి ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారో చెప్పాలన్నారు. తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న మురుగు వ్యవస్థను బాగు చేయించాలని, సిమెంటు రోడ్డు నిర్మించాలని, సిలిండర్లను పంపిణీ చేయాలని కోరారు. అన్నిటికంటే ముందు రాయలచెరువు కట్ట పటిష్ఠం చేయాలని, పాఠశాల భవనాలను బాగు చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 625 పశువులు మృతి చెందగా గేదెకు రూ.50వేలు, ఆవుకు రూ.40వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, కోళ్లకు రూ.100 చొప్పున పరిహారం అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఇప్పటికే రూ.4 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. రుణాల విషయంలో బ్యాంకర్లతో మాట్లాడి మహిళలకు ప్రత్యేక సహాయనిధిని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పొలాల్లో ఇసుక, మట్టి మేటలుంటే హెక్టార్‌కు రూ.18వేలు, కోతకు గురైతే ఎకరాకు రూ.18వేలను త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు పోగొట్టుకున్నవారికి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి అందిస్తామన్నారు. విద్యార్థులు తాము చదువుకున్న విద్యా సంస్థల వివరాలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, గోవర్ధన్, సాదు, థామస్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, తహసీల్దారు రోశయ్య, ఎంపీడీవో మాలతి, ఏవో సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పశువులు, గొర్రెలు, మేకలు కోల్పోయిన వారికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నలుగురి అరెస్టు

వరదయ్యపాళెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం లక్ష్మీపురంలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను మంగళవారం ఉదయం మీడియాకు సీఐ మురళి వెల్లడించారు. ఆ ప్రకారం.. సీఎల్ఎన్ పల్లె మిట్ట హరిజనవాడలో గతనెల 30న గ్రామానికి చెందిన వంటమాస్టర్ హరి(33)ని దుండగులు హత్య చేసి పాడుబడిన ఇంట్లో పడేసి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మల్లికార్జున్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. చెన్నై నుంచి అన్నదమ్ములు గౌతమ్, ప్రేమ్‌కుమార్ గ్రామంలో వచ్చి నివాసం ఉంటున్నారు. వారితో హరితో స్నేహంగా ఉండేవారు. గౌతమ్ స్థానికంగా ఏసీ పరిశ్రమలో పని చేస్తుండగా, ప్రేమ్‌కుమార్ జులాయిగా తిరిగేవాడు. ముగ్గురూ కలిసి మద్యం తాగేవారు. ఈ క్రమంలో మద్యం మత్తులో జరిగిన గొడవలో గౌతమ్, ప్రేమ్‌కుమార్ కలిసి హరిపై దాడి చేశారు. గమనించిన హరి బంధువులు, గ్రామస్తులు గౌతమ్, ప్రేమ్‌కుమార్‌ను హెచ్చరించారు. ఎక్కడినుంచో వచ్చి తమ గ్రామానికి చెందిన వ్యక్తిని ఎలా కొడతారంటూ తిట్టి పంపించారు. మీరేం చేయలేరంటూ హరి వారికి సవాల్ విసిరాడు. దీంతో అహం దెబ్బతిన్న గౌతమ్, ప్రేమ్‌కుమార్.. హరిని కడతేర్చాలని పథకం పన్నారు. కొద్ది రోజుల తరువాత హరితో ఎప్పటి లాగే సఖ్యంగా మెలిగారు. రోజూ హరికి మద్యం తాగించేవారు. గత నెల 30వ తేదీ హరి భార్య దేవసేన ఊరికి వెళ్లడంతో ఇదే సరైన సమయమని భావించిన గౌతమ్, ప్రేమ్‌కుమార్.. హరిని తమ ఇంటికి తీసుకెళ్లి ఫుల్‌గా మద్యం తాగించారు. అప్పటికే తమ ఇంట్లో హత్య కోసం చెన్నై నుంచి పిలిపించుకున్న మరో ఇద్దరు స్నేహితుల సహకారంతో గౌతమ్, ప్రేమ్‌కుమార్‌లు హరిని ఐరన్‌రాడ్, బండరాయితో హత్య చేశారు. హరి మృతి చెందాడని నిర్ధారించుకున్న తరువాత హత్యకు ఉపయోగించిన బండరాయిని, మృతుడిపై ఉన్న మరకలను శుభ్రంగా కడిగి, సమీపంలోని పాడుబడిన ఇంట్లో మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్‌ను, తాము ధరించిన దుస్తులను కాల్చి ఉబ్బలమడుగు సమీపంలోని నీటి కాలువలో కలిపేశారు. మృతుడి భార్య దేవసేన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఉబ్బలమడుగు క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులో తీసుకుని విచారణ చేయడంతో హత్యను చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. గౌతమ్, ప్రేమ్‌కుమార్‌తో పాటు చెన్నై థౌజండ్‌లైట్స్‌కి చెందిన జాన్‌పాల్ అలియాస్ జాన్, ఊటీకి చెందిన బెంజమిన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్, బండరాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ మల్లికార్జున్, సత్యవేడు రెండో ఎస్ఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.


నిందితులను మీడియా ముందు చూపుతున్న సీఐ మురళి

ప్రజల ఆకాంక్షను గుర్తించండి


టవర్‌క్లాక్ వద్ద దీక్షలో జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు ప్రజల ఆకాంక్షను గుర్తించి నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. పట్టణంలో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చేపట్టిన రిలే దీక్ష మంగళవారం నాటికి మూడో రోజుకు చేరింది. ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు, ఆటో కార్మికులు, బీజేపీ నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారని చెప్పారు. గూడూరుకు దగ్గరగా ఉండే నెల్లూరే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలను కోరారు. ఇదే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతకు స్థిరమైన ఉపాధి

- మంత్రి లోకేశ్ నిరంతర కృషి
- అమెరికా పర్యటన సత్ఫలితాలిస్తోందన్న భానుప్రకాష్

నగరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన సత్ఫలితాలనిస్తోందన్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే భాను కూడా ఉన్నారు. ఏపీని పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా పరిచయం చేస్తూ లోకేశ్ ప్రముఖ సంస్థలతో పలు కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సెమీకండక్టర్, కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆయా ప్రముఖ సంస్థలను లోకేశ్ ఆహ్వానించినట్లు వివరించారు. రాష్ట్ర ఆర్థిక బలోపేతం, పరిశ్రమల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలే అమెరికా పర్యటన ప్రధాన ఉద్దేశమన్నారు.


మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

డివైడర్ ఢీకొన్న ఆటో

- తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు


గాయపడ్డ మహమ్మద్ అలీ, రహమాన్

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి వద్ద మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తిరుపతికి చెందిన మహమ్మద్ అలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఏడుగంగల జాతర కోసం తిరుపతి నుంచి పూలమాలలను తీసుకుని ఆటోలో కొడుకు అబ్దుల్ రహమాన్‌తో పాటు బయలుదేరారు. నాయుడుపేట- రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి పట్టణంలోకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు ఆరంభమయ్యే చోట ఆటో అదుపుతప్పి డివైడర్ను ఢీకొంది. ఈ ఘటనలో వీరిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం క్షతగాత్రులను తిరుపతి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

- పొగాకు పొడి చల్లి నగ లాక్కెళ్లిన

ఆటో డ్రైవర్ సహా ముగ్గురి అరెస్టు

- బంగారు గొలుసు, కత్తులు, ఆటో స్వాధీనం



నిందితుల అరెస్టును చూపుతున్న తిరుపతి రూరల్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో ఆదివారం సాయంత్రం పొగాకు పొడి చల్లి, కొట్టి మహిళ మెడలో బంగారు నగ లాక్కెళ్లిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. రైల్వే కోడూరులోని శ్రీరామ్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కస్తూరి జయకృష్ణ, అదే ప్రాంతానికి చెందిన మాచినేని శిరీష, అన్నమయ్య జిల్లా రాజంపేట తాలూకా కొట్టపల్లికి చెందిన లింగుట్ల వెన్నెల మిత్రులు. వీరు చిన్నప్పటి నుంచి జులాయిగా తిరిగేవారు. చిన్న దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాలలో అటెండరుగా పనిచేస్తున్న మల్లిక డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లడానికి రోడ్డుపై నిలబడి ఉన్నారు. ఇంతలో పెరుమాళ్లపల్లి వైపు వెళుతున్న ఆటో వచ్చింది. ఆటోలో అప్పటికే ఇద్దరు మహిళలు ఉండటంతో ఆమె ధైర్యంగా ఎక్కారు. పథకం ప్రకారం ఆ ఇద్దరు మహిళలు ఆటో డ్రైవర్ సహాయంతో మల్లిక కళ్లలో పొగాకు పొడి చల్లి తలపై రాడ్డుతో కొట్టారు. ఆమె మెడలో వున్న బంగారు చైను లాక్కొని ఆటో నుంచి కిందకు తోసేసి పరారయ్యారు. దాడిలో బాధితురాలికి తలపై బలమైన గాయం కావడం, శరీరమంతా చిన్నపాటి దెబ్బలు తగలడంతో స్థానికులు రుయాలో చేర్పించారు. ఈ ఘటన జరిగిన వెంటనే ఎస్పీ సుబ్బరాయుడు స్పందించి చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వాడుతున్న మొబైల్ ఫోన్ల ఆధారంగా వాళ్లున్న ప్రాంతాన్ని గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా చెర్లోపల్లి జంక్షన్ వద్ద అయాన్ డిజిటల్ సమీపంలో నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి 24 గ్రాముల బంగారు చైను, దోపిడీకి ఉపయోగించిన కత్తులు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని అత్యంత వేగంగా ఛేదించిన పోలీసు బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తిరుమలలో దుకాణాల పరిశీలన

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యురాలు అనుగోలు రంగశ్రీ మంగళవారం తిరుమలలోని దుకాణాలను పరిశీలించారు. ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలిసి ఆమె తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లారు. అక్కడి దుకాణాల లైసెన్సులను స్వయంగా పరిశీలించారు. అనధికారికంగా ఎవరైనా దుకాణాలు నిర్వహిస్తున్నారా అని తనిఖీ చేశారు. అలాగే హాకర్ లైసెన్సులను కూడా చూశారు. టీటీడీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పలువురు దుకాణదారులకు సూచనలు చేశారు.


లైసెన్సులు పరిశీలిస్తున్న రంగశ్రీ

నేడు చిత్తూరుకు లంకా దినకర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 20 సూత్రాల కార్యక్రమాల అమలు (స్వర్ణాంధ్ర - వికసిత్ భారత్) చైర్మన్ లంకా దినకర్ బుధవారం చిత్తూరులో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్&బీ అతిథిగృహానికి చేరుకుంటారు. 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ఆరోగ్య, విద్య, అమృత్‌స్కీమ్, జలజీవన్ మిషన్, పీఎం సూర్యఘర్ తదితర కేంద్ర పథకాల అమలుతో పాటు పలు ఇతర అంశాలపై అధికారులతో సమీక్షిస్తారన్నారు.

డిగ్రీ పరీక్షల వాయిదాపై వదంతులు నమ్మకండి

అసత్య ప్రచారంపై పోలీసులకు ఎస్వీయూ ఫిర్యాదు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షల వాయిదాపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఆ వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం సూచించారు. ఈ నెల 9 వ తేదీన జరగాల్సిన పరీక్ష 14 వ తేదీ నిర్వహిస్తామన్నారు. 10 నుంచీ జరగాల్సిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా చేపడతామన్నారు. పరీక్షల వాయిదాపై కొందరు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. పరీక్షల వాయిదాపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

22 వేల ఎస్సీ, ఎస్టీ గృహాలకు సోలార్ పలకల ఏర్పాటుకు సన్నద్ధం

● విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 22 వేల ఎస్సీ ఎస్టీ గృహాలకు పీఎం సూర్యఘర్ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. మంగళవారం గిరింపేటలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ జిల్లాలో 86 వేల మంది 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని పొందుతున్నారన్నారు. అందులో 31 వేల మందికి మాత్రమే సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు రూఫ్‌టాప్ ఉందన్నారు. ఇందులో మొదటి విడతగా 22 వేల కుటుంబాల ఇంటిపై పీఎం సూర్యఘర్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతాల్లో రూ.25 కోట్లతో 500 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ అవసరాలకు పీఎం కుసుం కింద సోలార్ యూనిట్ల ఏర్పాటుకు చిత్తూరు డివిజన్ పరిధిలో 320 ఎకరాలు, కుప్పం నియోజకవర్గంలో 570 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఎంపిక చేసిందన్నారు. చిత్తూరు యూనిట్ ద్వారా 80 ఎంయూ, కుప్పం యూనిట్ నుంచి 150 ఎంయూ విద్యుత్ ఉత్పత్తి చేయనున్నమన్నారు. సమావేశంలో కన్‌స్ట్రక్షన్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

13న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న నవోదయ ప్రిన్సిపాల్ గీత

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈనెల 13న జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష జరగనుంది. ఇందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని నవోదయ ప్రిన్సిపాల్ గీత సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 80 సీట్ల కోసం 4300 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరీక్షలకు 23 సెంటర్లు ఏర్పాటు చేయగా, జిల్లాలో 12, అన్నమయ్యజిల్లాలో 6, తిరుపతిజిల్లాలో 5 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు సెంటర్లలో తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జవహర్ పరీక్షల ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, సైన్స్ టీచర్ శ్రీనివాస మూర్తి, విద్యాశాఖ ఏసీ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ చర్యలు:కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా... ప్రోత్సహించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారుల సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేసే సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 78 ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులలో స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, వాటిపై అధికారులు తనిఖీలు చేస్తూ పూర్తి స్థాయిలో నివేదికలు ఇవ్వాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయన్న సమాచారం ఉంటే వాటి వివరాలను అందిస్తే పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీల్లో రుజువైతే వాటిని సీజ్ చేసి జరిమానా వేసి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తింపులేని ఆర్ఎంపీ డాక్టర్లు క్లీనిక్‌లు నిర్వహిస్తుంటే, అట్టివాటిని మూయించే దిశలో చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డీటీ సుధారాణి, డాక్టర్లు వెంకటప్రసాద్, హనుమంతరావు, ప్రవీణ్, అనిల్‌కుమార్, అనూష, లత, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

5 ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ స్థానాలకు 11న ఎన్నికలు

చిత్తూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5 ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ స్థానాలకు ఈ నెల 11న ఎన్నికలు జరగనున్నాయి.తంబళ్లపల్లె, విజయపురం, నింద్ర, ఏర్పేడు, వరదయ్యపాళ్యం ఎంపీపీ స్థానాలకు, సత్యవేడు వైస్ ఎంపీపీ స్థానానికి ఈ ఎన్నికలు జరగనున్నాయి.

ఆయుష్ వైద్యసేవలు ప్రపంచవ్యాప్తం చేస్తాం

తిరుపతి(వైద్యం),డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మన దేశ సంప్రదాయ వైద్యమైన ఆయుష్ వైద్యసేవలను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఢిల్లీలో 2వ గ్లోబల్ సమ్మిట్ ఆన్ ట్రెడిషనల్ మెడిసిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని హోమియోపతి శాస్త్రవేత్త డాక్టర్ రవిచంద్రారెడ్డి అన్నారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.గతంలో గుజరాత్‌లో నిర్వహించిన మొదటి గ్లోబల్ సమ్మిట్ ఎంతో విజయవంతమైందన్నారు. ఇప్పుడు నిర్వహించే రెండవ సమ్మిట్‌లో కూడా చక్కటి ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులు విచ్చేసి ఆయుష్ వైద్యసేవల ప్రాముఖ్యతను వివరిస్తారన్నారు.ఆయుష్ వైద్యాన్ని ప్రజలకు చేరువచేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తారన్నారు. తిరుపతిలోనూ ఆయుష్ ఆధ్వర్యంలో చక్కటి హోమియో వైద్యసేవలను అందిస్తున్నామని ఆయన వివరించారు.

వారపు సంతలో థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్. మంగళవారం వెదురుకుప్పం మండలంలో పర్యటించారు.తిరుగు ప్రయాణంలో వారపు సంతలో ఇంటికోసం కూరగాయలు, ఆకు కూరలు కొనుగోలు చేశారు.



కూరగాయలను కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే థామస్ →

ఆగని గజదాడులు

పంటలకు అపార నష్టం.. బీళ్లుగా మారుతున్న పొలాలు



ఎగువ కొత్తూరు వద్ద ఏనుగులు తొక్కేసిన టమోటా తోట

సోమల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల దాడులతో రైతుల పంటలకు అపార నష్టాలు పెరిగి సాగు ఖర్చులతో పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకున్నాయి. రైతులు వరి సాగుకు ఆసక్తి చూపడం లేదు. సాగు పెట్టుబడులు భారీగా పెరగడం, ట్రాక్టర్‌తో దుక్కులకు గంటకు రూ.1000, కూలి రూ.500కు మించడంతో సామాన్య రైతులు సేద్యం చేయలేక పోతున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు సాగుచేసినా ఏనుగులు, అడవిపందులు, దుప్పులు, నెమళ్లు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మండలంలోని అన్నెమ్మగారిపల్లె, చిన్నఉప్పరపల్లె, పేటూరు, ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె పంచాయతీలోని గ్రామాల్లో నెలల తరబడి ఏనుగులు తిష్టవేసి పంటలను ధ్వంసం చేయడం, వరి కోతల సమయంలో పంటలను తొక్కి నష్టపరుస్తున్నాయి. వరి, మామిడి సీజన్‌లో ఆవులపల్లె పంచాయతీలో కోనమూల, వంగసాని చెరువు మూల, పేటూరు పంచాయతీలో కనికలచెరువులు ఏనుగులకు ఆవాసంగా మారాయి. మామిడి, టమోటా తోటల్లో చెట్లను, పండ్లను, టమోటా పంటను తొక్కివేయడంతో రైతన్నలు నష్టపోతున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి సాగుచేసిన టమోటాలకు ఊతంగా నాటిన కర్రలను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈక్రమంలోనే పొలాలు బీళ్లుగా మారుతున్నాయి.

పరిహారం అంతంతే....

ఏనుగుల దాడుల్లో పంటలు కోల్పోతున్న రైతులు ఫొటోలు తీసి పంట నష్టాలను అటవీ అధికారులకు, వీఆర్వో, ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ అధికారులకు అందజేసినా నామమాత్రపు పరిహారం మంజూరు చేయడం జరుగుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏనుగుల దాడులు జరుగుతున్నాయని అప్పటి రాష్ట్ర ఫారెస్టు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్‌రెడ్డి, అటవీశాఖ జిల్లా అధికారులు సోమల మండలంలోని రాంపల్లె, కొత్తూరు, ఎగువకొత్తూరు, ఇర్లపల్లెలో ఏనుగుల సంచార స్థలాలను పరిశీలించారు. నష్టపరిహారం పెంచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే నష్టపరిహారం యథావిధిగా నామమాత్రంగానే మొక్కుబడిగా ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏనుగులతో వ్యవసాయమే వదిలేశాం



సోమల పంచాయతీ నెలుకూరివారిపల్లె సమీపంలో 8 ఎకరాల పొలం ఉంది. అందులో 4 ఎకరాలు మామిడి తోట మిగతా 4 ఎకరాల్లో వరి, టమోటా సాగు చేస్తాం. గత నాలుగేళ్లుగా ఏనుగులు వరుస దాడులు చేస్తున్నాయి. మామిడి తోటల్లో చెట్లు విరిసేస్తున్నాయి. కుటుంబ అవసరాలకు... భ్యులకు సరిపడే వరి సాగు చేస్తే కోతల సమయంలోనే ఏనుగులు దాడులు చేస్తున్నాయి. గత ఏడాది టమోటా సాగు చేస్తే పంటను తొక్కివేసి ఊతంగా నాటిన కర్రలను ధ్వంసం చేశాయి. నష్టపరిహారం మాత్రం అందలేదు.

- పోలూరు చలపతి రైతు, సోమల

నష్టపరిహారం పెంచాలి



లక్షలు ఖర్చు చేసి పంటలు సాగు చేస్తే కోత దశలో ఏనుగులు పంటలపై దాడులు చేసి తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. అటవీ శివారుల్లో కందకాల కోసం తవ్వకాలు చేపడితే ఏనుగుల దాడులను అరికట్టవచ్చు. వన్యప్రాణుల దాడులతో నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం పెంచాలి. గతంలో చెరకు సాగు చేసేవాళ్లం. ఏనుగుల దాడులతో పంట సాగు చేయలేక పోతున్నాం.

- టి.రమేశ్ నాయుడు, మాజీ ఎంపీటీసీ, కమ్మపల్లె

మధురమలై కొండకు చేరిన ఏనుగులు



ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి, టమోటా తోటలు

సోమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం నెలుకూరివారిపల్లె సమీపంలో టమోటా, వరి పంటల్లో స్వైరవిహారం చేసి బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. మంగళవారం పగలే మధురమలై కొండ వద్ద ఏనుగులు సంచరించడంతో పశువులను మేత పట్టుకెళ్లడానికి అడవి వైపు రావడానికి రైతులు ఇబ్బందులుపడ్డారు. కాగా ఆవులపల్లె పంచాయతీలోని ఒంటరి ఏనుగు ఇళ్లపల్లెకు చెందిన ఊసన్న వరి పొలంలో తిరగాడి పంటను ధ్వంసం చేసింది. రైతులు ఎంతో ఖర్చు చేసి సాగుచేసి కోతకు సిద్ధంగా ఉన్న వరి, టమోటా తోటల్లో గజరాజులు స్వైరవిహారం చేసి పంటలను తొక్కివేయడంతో కడుపు కోత మిగులుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు జట్లుగా ఏర్పడి సొంత ఖర్చులతో టపాసులు పేల్చుకుంటూ, డప్పుల శబ్దం చేస్తున్నామన్నారు. మరికొందరు పొలాల వద్దనే మంటలు వేసుకొని జాగరణ చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పంటపొలాలపై ఆగని గజదాడులు



ధ్వంసమైన అరటి చెట్లను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

యాదమరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోడబండ్ల బీట్ పరిధిలోని తాళ్ళమడుగు, ఎగువ పాతపాళ్యం, దళవాయిపల్లె గ్రామాల్లో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసింది. భూమిరెడ్డిపల్లె సమీపంలోని నుంజర్ల అటవీ ప్రాంతంలో 13 ఏనుగులు గుంపులుగా విడిపోయి అరటి, మామిడి, టెంకాయ (కొబ్బరి) చెట్లు, వరిపంటలను నాశనం చేశాయి. ఎగువ పాతపాళ్యం అటవీప్రాంతం వద్ద వరి, కొబ్బరి, మామిడి, అరటిపంటలను పూర్తిగా నాశనం చేశాయని బాధిత రైతులు రైతులు ప్రసాద్, వెంకటేష్ యాదవ్, సుబ్రహ్మణ్యం, శ్రీనులు వాపోయారు. చలితీవ్రత తక్కువగా ఉండటం, దట్టమైన అడవి కావడంతో ఏనుగుల గుంపు ఈ ప్రాంతాన్ని వీడటంలేదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఎఫ్ఎస్‌వో మోహన్‌మురళి, ఎఫ్‌బీవో ప్రతాప్ పంటలను పరిశీలించారు.

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో 1 నుంచి గేట్‌పాస్ రద్దు

● ఎమ్మెల్యే జగన్మోహన్



డ్రగ్ కంట్రోల్ అధికారి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జగన్మోహన్

చిత్తూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వసూళు చేస్తున్న గేట్‌పాస్‌ను జనవరి 1నుంచి రద్దు చేయనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రకటించారు. మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో ప్రభుత్వ ఆస్పత్రిలో గేట్‌పాస్ వసూలు చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. ఈ క్రమంలో గేట్‌పాస్ రద్దుచేయాలని ఆస్పత్రి అధికారులు, గేట్ పొందిన వారిని ఆదేశించామన్నారు. జనవరి 1 నుంచి గేట్‌పాస్ చెల్లించనవసరం లేదన్నారు. దీనిపై నవంబరు 24వ తేదిన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రభుత్వ ఆస్పత్రిలో మళ్లీ పార్కింగ్ ఫీజు' అనే శీర్షిక ప్రచురించింది. ఎమ్మెల్యే స్పందించి ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

తరచుగా మెడికల్ షాపులను తనిఖీ చేయండి

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి కార్యాలయాన్ని ఎమ్మెల్యే జగన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చిత్తూరు పర్యటనకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌తో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి, నియోజకవర్గంలో పలు ప్రభుత్వ ఆస్పత్రులు అభివృద్ధి చేయాలని కోరారమన్నారు. ఆయన వెంటనే చిత్తూరు నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి రూ.3.84 కోట్లు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ హేమలత, మేయర్ అముద, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన, అపోలో యూనిట్ హెడ్ బాలరాజ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, ఆర్ఎంవో సంధ్య, అపోలో ఏవో రాంగోపాల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రమేష్‌నాయుడు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బెంబేలెత్తించిన కొండచిలువ



శ్రీరంగరాజపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జనావాసం చేరువకు వచ్చి ఓ కొండచిలువ బెంబేలెత్తించింది. మెదవాడకు చెందిన కొందరు మంగళవారం ఉదయం పశువులు, మేకలను సమీపంలోని బీడు భూమిలో మేతకు తీసుకువెళ్లారు.ఈక్రమంలో సమీపంలోని అడవి నుంచి భారీ కొండ చిలువ వచ్చింది. దీంతో వారంతా ఒక్కసారిగా భయపడి కేకలు వేశారు. దీంతో గ్రామస్తులు చేరుకున్నారు. ఈలోగానే పెద్ద కొండచిలువ అడవిలోకి వెళ్లిపోయింది. మరోపక్క సోమవారం రాత్రి మెదవాడ, పిళ్లారికుప్పం సమీపంలో చిరుతపులి సంచరిస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కగా చిరుతపులి సంచారంపై ఆనవాళ్లు కనిపించలేదని అటవీ అధికారులు స్పష్టం చేశారు.

పంట అవశేషాలతో సహజ పోషకాలు

● వ్యవసాయ శాఖ జేడీ సూచన

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంట అవశేషాలను సద్వినియోగం చేసుకుని భూమికి సహజ పోషకాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ రైతులకు సూచించారు.పంట వ్యర్థాలు, భూమికి సహజ పోషకాలు ఇస్తాయన్నారు., వాటిని కాల్చితే నష్టం జరుగుతుందన్నారు. పంట అవశేషాలను పశువులకు మేతగా, బెడ్డింగ్ పదార్థంగా వాడుకోవచ్చునన్నారు. నేలలో తేమను పరిరక్షించే మల్చింగ్‌గా ఉపయోగించవచ్చునన్నారు. కంపోస్టు తయారీలో మూల పదార్థంగా బయోగ్యాస్‌గా ఇథనాల్ తయారీలో, పుట్ట గొడుగుల పెంపకంలో బయోచార్ తయారీలో, పార్టికల్ బోర్డులుగా ఉపయోగించుకోవచ్చున్నారు. పంట అవశేషాల్లో నత్రజని, భాస్వరం, పోటాషియం, సూక్ష్మపోషకాలు ఉంటాయని తెలిపారు. ఈ అవశేషాలను సూక్ష్మ జీవుల కన్సార్షియంగా ఉపయోగించి ఎరువుగా వాడితే భూభౌతిక స్థితి మారుతుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, నేల సారాన్ని కాపాడాలంటే రైతులందరూ విధిగా పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నాలని వివరించారు.

సకాలంలో వైద్యం అందకే బద్రీనారాయణ మృతి

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఇకనైనా సేవలు మెరుగుపరచాలి ● ఎమ్మెల్యే జగన్మోహన్



అపోలో, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి, అభివృద్ధి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు రూరల్ డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు మెరుగుపరచాలని ఎమ్మెల్యే జగన్మోహన్ సూచించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బద్రీనారాయణ చనిపోవడానికి చిత్తూరు ప్రభుత్వఆస్పత్రిలో నిర్లక్ష్యమే కారణమంటూ ఆయన కొడుకు నవీన్ తనవద్ద ఆవేదన వ్యక్తం చేశాడని చెప్పారు. ఆస్పత్రి ఆస్పత్రి వైద్యులు, అపోలో యాజమాన్యం, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో ఆయన మంగళవారం సమస్యలపై చర్చించారు.ఓ కమిటీ సభ్యుడు మాట్లాడుతూ సోమవారం రాత్రి తన బంధువు అనారోగ్య సమస్యతో వస్తే వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దీంతో ఎమ్మెల్యే కలగజేసుకొని బద్రీనారాయణకు గుండెనొప్పివచ్చిన వెంటనే ఇక్కడికి తీసుకొస్తే వైద్యం అందించడం ఆలస్యం చేశారని, తిరుపతికి తీసుకెళ్తుండగా పల్స్ పడిపోయి మృతి చెందారని ఆయన కుమారుడు నవీన్ చెబితే చాలా బాధేసిందన్నారు. ఇకపై బాధ్యతగా పనిచేసి ఏ ప్రాణంపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంబులెన్సులను వాడడంలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఆస్పత్రిని లీజుకు ఇచ్చి ఎనిమిదేళ్లవుతున్నా న్యూరాలజి, కార్డియాలజి, నెఫ్రాలజి శాఖలను అపోలో ఏర్పాటు చేయలేదని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ సురేష్ తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో అపోలో యాజమాన్యంతో సమావేశమై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పీజీఆర్ఎస్ వినతిపై కలెక్టర్ స్పందన



కీరమంద పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తింటున్న కలెక్టర్

బంగారుపాళ్యం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం కొదలమడుగు పంచాయతీ లోని బండ్లదొడ్డి యానాదులు గత వారం చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరయ్యారు. గ్రామంలో స్మశానం కోసం స్థలం కేటాయించాలని,మురుగునీటి కాలువ కట్టించాలని,ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం బండ్లదొడ్డిలో కలెక్టర్ సుమిత్ కుమార్ పర్యటించారు.యానాదుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.స్మశాన వాటిక స్థలం పరిశీంచిన ఆయన మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు.ప్రాథమిక పాఠశాల భవనం ఉరుస్తోందని చెప్పగా పరిశీలించిన ఆయన నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. కీరమంద పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలతో పాటు భోంచేశారు.పాఠశాల ప్రహరీగోడతో పాటు ఆటస్థలం కోసం నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ ,సర్పంచు మాలతి, శ్రీనివాసులు,అన్నుబాబు, లక్ష్మీ, మునస్వామి,మూర్తి,కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎంతో పీఆర్ ఉద్యోగులు భేటీ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం అమరావతిలో సమావేశం కానున్నారు ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని దిశానిర్దేశం చేయనున్నారు. పంచాయతీరాజ్‌శాఖలో గత 17 నెలల్లో తీసుకొచ్చిన పలు సంస్కరణల గురించి, ఎంపీడీవోలు మొదలు కార్యదర్శుల వరకు పెద్దఎత్తున పదోన్నతులు కల్పించడం గురించి, పాలనలో పారదర్శకతకు స్వర్ణ పంచాయతీ పోర్టల్ ప్రారంభించడం గురించి మరోసారి వివరించనున్నారు.ఈ సమావేశంలో. పాల్గొనేందుకు జిల్లా నుంచి 48 మంది వెళ్లారు. వీరిలో 15 మంది డిప్యూటీ ఎంపీడీవోలు, 33మంది పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు ఉన్నారు.

కుప్పం రెస్కోకు సొంత వాహనం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్

కుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెస్కోకు సొంత వాహనం సమకూరింది. సిబ్బంది విధి నిర్వహణలో వినియోగించుకునేందుకు నూతనంగా కొనుగోలు చేసిన వాహనాన్ని మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్ ప్రారంభించారు. కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు, రెస్కో డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్‌ను, ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మీడియాతో మాట్లాడుతున్న పీకేఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబు

పుంగనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీకేఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబు కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలో అనధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాల్సి వుందన్నారు. 1985 నుంచి ఇప్పటి వరకు వరకు ప్లాన్ అప్రూవల్ చేసుకోని వారికి ప్రస్తుతం చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. పట్టణాల పరిధిలో ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ కాని ప్లాట్లు కొనుగోలు చేస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. క్రమబద్ధీకరణ చేసుకోని లే అవుట్ ప్లాట్ల క్రయ, విక్రయాలు జరగకుండా రిజిష్టర్ కార్యాలయంలో నిషేధిత భూముల జాబితాలో ఉంచడం జరుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేవారు దరఖాస్తుతో పాటు 50శాతం రుసుం చెల్లించాల్సి ఉందన్నారు. కనీసం రూ.10వేలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ అనుమతులు పొందడానికి జనవరి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకున్న వారు 14శాతం ఓపెన్ ఖరీదులో 50శాతం మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలిపారు. మార్కెట్ విలువను బట్టి ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డి, డీఈఈ మహేశ్, టీపీఎస్ జగదీశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీసు గిరిబాబు, సుహేల్‌బాషా, దినేష్, సద్దాంహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఉదయకుమార్

శాంతిపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని 23 పంచాయతీల్లో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశాలు జరిగాయి. శివరామపురం, మఠం, కొలమడుగు, దండికుప్పం, అబకలదొడ్డి, కడపల్లె తదితర గ్రామ పంచాయతీలలో జరిగిన సమావేశాలకు ఆయన మండల టీడీపీ నేతలతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ భాష్యం విశ్వనాథనాయుడు, క్లస్టర్ ఇంచార్జి రాజేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్, ఏఎంసీ నాగరాజు, దాము, జయపాల్ శ్యామల, పొలారాణి, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ పరిరక్షణ



ఎలక్ట్రిక్ సైకిళ్లను ప్రదర్శిస్తున్న కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, ఎమ్మార్ సురేష్

కుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, ఎమ్మార్ సురేష్ అన్నారు. కుప్పం పురపాలకసంఘం 3, 4 సచివాలయంలో మంగళవారం ఎలక్ట్రిక్ సైకిళ్ల నమూనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సబ్సిడీపై ఎలక్ట్రిక్ సైకిళ్లను చిరు వ్యాపారులకు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ వీటిని తీసుకుని, అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం సులువుగా ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. దీనివల్ల సంప్రదాయ ఇంధనమైన పెట్రోలు వినియోగం తగ్గి, పర్యావరణ పరిరక్షణ కూడా జరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, శ్రీధర్, బాలాజీ, చంద్ర, శ్రీకాంత్, జమీర్, లోకేష్, మహిళలు, సచివాలయ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతును రారాజు చేయాలన్నదే సీఎం లక్ష్యం: టీడీపీ



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు, అధికారులు

శాంతిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అన్నదాతలను రారాజులను చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఉదయ్ కుమార్ నాయుడు అన్నారు. మంగళవారం శివరామపురం పంచాయతీ రైతులకు ఆర్బీకేలో రాయితీ ఎరువులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ భాష్యం విశ్వనాథనాయుడు, సింగిల్‌విండో చైర్మన్ గోపాల్, శాంతిపురం క్లస్టర్ ఇంచార్జి రాజేంద్ర, పీవీ నాగరాజు, రాళ్లబూదుగూరు మాజీ క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ నాగరాజు, యూనిట్ ఇంచార్జిలు శేఖర్, బాలు, సింగిల్‌విండో డైరెక్టర్ దాము, రమేష్, ఏఎంసీ డైరెక్టర్ శ్యామల, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు హేమావతి, అధికారులు పాల్గొన్నారు.

పట్టపగలే జగనన్నకాలనీలో చోరీ

పుంగనూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టపగలే జగనన్నకాలనీలోని ఓ ఇంటిలో గుర్తు తెలియని దుండగులు తలుపులు బద్దలు కొట్టి చోరీ చేసిన సంఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు... మండలంలోని సింగిరిగుంట పంచాయతీ మార్లపల్లె సమీపంలోని జగనన్న కాలనీకి చెందిన అంకయ్యమ్మ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. అయితే ఉదయం కూలీపనుల నిమిత్తం ఆమె వెళ్లడంతో గుర్తు తెలియని దుండగులు తలుపులు బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం ఇంటికి రాగానే తలుపులు తీసి ఉండటాన్ని చూసి లోనికి వెళ్లి చూడగా దుస్తులు ఇల్లంతా చల్లాచెదురుగా ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు బాధితురాలు తెలిపింది. ఇంటిలోని రూ.లక్షన్నర విలువ చేసే బంగారు నగలు, నగదు తీసుకెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ వెంకటరమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పలమనేరు ఏజీపీగా జగదీష్ నాయుడు



పలమనేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పలమనేరు జూనియర్ సివిల్‌జడ్జికోర్టు, జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులకు ఏజీపీగా పలమనేరు తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ అధ్యక్షులు కట్టా జగదీష్‌నాయుడిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా జగదీష్‌నాయుడు మాట్లాడుతూ తనమీద నమ్మకంతో ఇంతటి బాధ్యతలను అప్పగించేందుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ అధికారుల అతిథిగృహ నిర్మాణానికి భూమిపూజ

కుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గం కుప్పం సమీపంలోని గుత్తార్లపల్లె పరిధిలో మంగళవారం ప్రభుత్వ అధికారుల అతిథిగృహ నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే క్రమంలో ఎందరో రాష్ట్రస్థాయి అధికారులు కుప్పంలో పర్యటిస్తుంటారన్నారు. వారందరూ బస చేసేందుకు అనువుగా ప్రభుత్వ అధికారుల అతిథిగృహాన్ని రూ.4.70 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ఎం.రాజగోపాల్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ విజేత దేవా అర్జున్‌కు సన్మానం



దేవా అర్జున్ ను సన్మానిస్తున్న మధుమోహనరావు

పలమనేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన దేవా అర్జున్‌ను సామాజిక సేవాకార్యకర్త మధుమోహనరావు శాలువకప్పి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. దేవాఅర్జున్ గతనెల 25న గోవాలో నిర్వహించిన బాడీబిల్డింగ్ పోటీలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ క్రమంలో మంగళవారం పలమనేరు లింగాయతి వీధిలో కాపురమున్న లేట్ హరిప్రసాద్, రేవతి ఇంటికి వెళ్లి వారి కుమారుడు దేవా అర్జున్‌ను సన్మానించారు. దేవా కుటుంబసభ్యులు కూడా పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పశువైద్య శిబిరంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసులు నాయుడు

కల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లిలో మంగళవారం జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 189 పశువులకు గ్రోమార్ల నివారణ మందులు కొట్టారు. 49 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబందించి పరీక్షలు నిర్వహించారు. 59 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. పశువైద్యాధికారులు చందనప్రియ, తబ్రీస్‌బాషా, శ్రీహరి, టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, అరుణాచలంనాయుడు, చెంగల్రాయనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం



సోమల సింగిల్‌విండో కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు

సోమల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే టీడీపీ ధ్యేయమని సోమల సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్, పార్టీ పరిశీలకుడు నౌషాద్ పేర్కొన్నారు. మంగళవారం సోమల పంచాయతీలోని ముంద్రివారిపల్లె, సోమల టీడీపీ బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. టీడీపీ కార్యకర్తలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి, పట్టణ అధ్యక్షుడు మహేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి మృతి

పుంగనూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు బుధవారం మృతి చెందినట్లు స్థానిక పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ విశ్వనాథ్ తెలిపారు. ఆయన కథనం మేరకు... మండలంలోని చదళ్ల పంచాయతీ చెర్లోపల్లెకి చెందిన మునస్వామి(65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గత శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి ఆందోళనంగా ఉందని డాక్టర్లు సూచించడంతో తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

చౌడేపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏవో లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం ఆమె స్థానిక హైస్కూల్‌లో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగాంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ శివకుమార్, ఏవో మోహన్‌కుమార్, ఎంఈవోలు కేశరెడ్డి, తిరుమలమ్మలు, ఇన్‌చార్జి హెచ్ఎం పరిమళ, ఉపాధ్యాయులు, అరుంధతి, శ్రీలత, వీఏఏ నవీన్ పాల్గొన్నారు.

14న ఉచిత ఆయుర్వేద శిబిరం

గంగవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన స్థానిక లయన్స్‌క్లబ్‌లో ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లయన్స్‌క్లబ్, వెంకటేశ్వర ఆయుర్వేదిక్ కళాశాల చిత్తూరు వారి సహకారంతో జరిగే ఈ శిబిరంలో 14వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

31న విద్యుత్ అదనపు లోడ్ చెల్లించడానికి గడువు

పుంగనూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 31తేదీ లోపు రైతులు వ్యవసాయ బోర్ల అదనపు లోడ్‌కు చార్జీలను రాయితీతో చెల్లించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ అదనపు వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జనవరి నుంచి పలమనేరు ప్రజలకు

కౌండిన్య జలాశయం తాగునీరు



ఎద్దుల సంత వీధిలోని తాగునీటి శుద్ధి కేంద్ర భవనం, ఫిల్టర్‌బెడ్‌లో చేసిన మార్పులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, కౌండిన్య రిజర్వాయర్ వద్ద పొంగి పొర్లుతున్న నదీజలాలు

పలమనేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రజలకు జనవరి 1నుంచి కౌండిన్య జలాశయం నుంచి తాగునీరు సరఫరా చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మూడేళ్లుగా వర్షాలు ఆశాజనకంగా కురియకపోవడంతో కౌండిన్య నదిపై నిర్మించిన జలాశయం 2024 ఫిబ్రవరిలో ఒట్టిపోయింది. అప్పటి నుంచి పలమనేరు ప్రజలకు కావలసిన తాగునీటి కోసం అధికారులు కొత్తగా అక్కడక్కడా బోర్లువేసి డైరెక్టు పంపింగ్ చేయడంతోపాటు వేసవిలో మూడునెలలపాటు ట్రాక్టర్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటిని తెప్పించి సరఫరా చేశారు. అయితే గత మూడు నెలలుగా వర్షాలు బాగా కురవడంతో కౌండిన్య నది జలకళ సంతరించుకొంది. దీంతో పలమనేరు సమీపంలోని కాలువపల్లి వద్ద ప్రజల తాగునీటి కోసం నిర్మించిన కౌండిన్య జలాశయం సైతం నిండి పొంగిపొర్లింది. ఇప్పటికీ రిజర్వాయర్ నీరు కిందికి తరలిపోతోంది. దీంతో అధికారులు కౌండిన్య జలాశయం నుంచి తాగునీటి సరఫరా పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. కాగా రిజర్వాయర్ వద్ద ఏర్పాటుచేసిన తాగునీటి శుద్ధి కేంద్రం నిర్మించి దశాబ్దకాలమైంది. ఈ క్రమంలో తాగునీటి శుద్ధి కేంద్రంలో పాతబడిన ఫిల్టర్ ఇసుక, రాళ్లతో పాటు పైపులను తొలగించి, మరమ్మతు పనులు చేసేందుకుగాను సుమారు రూ.40 లక్షలకు పైగా వెచ్చిస్తున్నారు. ఈ పనులు పూర్తి అయిన తరువాత ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు. వాస్తవానికి డిసెంబరు మొదటి వారం నుంచే కౌండిన్య రిజర్వాయర్‌నుంచి నీటిని సరఫరా చేసేందుకు అధికారులు నిర్ణయించినప్పటికీ పనులు పూర్తికాకపోవడంతో మరో నెలరోజులు ఆలస్యమైందని కమిషనర్ తెలిపారు. ఈ పనులు పూర్తయ్యేందుకు దాదాపు 10నుంచి 12 రోజులు పట్టే అవకాశం ఉన్నందున జనవరి నుంచి కౌండిన్య రిజర్వాయర్‌నుంచి తాగునీటి సరఫరాను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండున్నరేళ్ల తరువాత పట్టణ ప్రజలు కౌండిన్య రిజర్వాయర్ నుంచి తాగునీటిని వినియోగించుకోనున్నారు.

గ్రామస్తుల సహకారంతోనే కోదండరామస్వామి ఆలయ నిర్మాణం



మీడియాతో మాట్లాడుతున్న గ్రామస్తులు

శాంతిపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) గ్రామస్తుల సహకారంతోనే కోదండరామస్వామి ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు సి.బండపల్లె గ్రామస్తులు తెలిపారు. మంగళవారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండరామస్వామి ఆలయం వద్ద గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ 300 సంవత్సరాల పురాతన కోదండరామస్వామి ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు సంవత్సర క్రితమే తీర్మానించుకున్నట్లు తెలిపారు. అందుకు కొంత డబ్బులు కూడా కూడుబెట్టుకున్నామని, దీనికి తోడు ప్రభుత్వం కూడా మరికొన్ని నిధులు మంజూరు చేసిందన్నారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని అధికారుల నుంచి వత్తిడి రావడంతో గ్రామస్తుల సహకారంతో ఐదు నెలల క్రితమే గర్భగుడి నిర్మాణం చేపట్టామన్నారు. ఆలయాన్ని మరింత విస్తరణ చేయడానికి పురాతన ఆలయం గోడలు అడ్డుగా ఉన్నాయన్నారు. గ్రామస్తుల సహకారంతో పక్కనే తాత్కాలిక షెడ్డు నిర్మించి, అందులో స్వామివార్ల మూల, ఉత్సవ విగ్రహాలను భద్రపరిచినట్లు తెలిపారు. తరువాత గ్రామస్తుల సమక్షంలోనే పురాతన ఆలయాన్ని కూలదోసినట్లు వివరించారు. ఇది గిట్టనివారు తమపై రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఇదిలాగే వదిలేస్తే కక్షలు పెరిగి గొడవలకు దారితీస్తాయని గ్రామపెద్దలు సర్దుబాటుచేసి, ఆలయ నిర్మాణానికి ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి చేయాలని గ్రామస్తులు తీర్మానించినట్లు తెలిపారు.

టీడీపీ అభివృద్ధికి కృషి



సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేతలు

కుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ కుప్పం మండల అధ్యక్షుడు ఎం.రాజగోపాల్ అన్నారు. కుప్పం మండలం టి.సదుమూరు పంచాయతీ సింగారపురంలో మంగళవారం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పంచాయతీ పరిధిలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై ఈ సమావేశంలో సమీక్షించారు. అలాగే శివాజీ అనే వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.3.31 లక్షలు విలువ చేసే చెక్కు పంపిణీ చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా పీఏసీ సభ్యుడు రామచంద్ర, మాజీ ఎంపీపీ సాంబశివం, నాయకులు సంతోష్, చంద్రశేఖర్, విభూషన్, మోహన్, చంద్ర, ప్రకాష్, ఆర్ముగం, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టరుకు సన్మానం



ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆనందరెడ్డి తదితరులు

రామకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ కుప్పం మండల మాజీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌ను ఆ పార్టీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నకృష్ణల ఆధ్వర్యంలో రామకుప్పం నేతలు మంగళవారం కుప్పంలో ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడా పీఏసీ సభ్యుడు రఘు, టీడీపీ మండల కార్యదర్శి మురళీ, బూత్ ఇన్‌చార్జీ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు కలిసికట్టుగా కృషి చేయాలి

రామకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ పటిష్టతకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రామకుప్పం, ముద్దనపల్లె పంచాయతీల్లో పార్టీ సమన్వయ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతలు, కార్యకర్తలు పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఎన్నో అవాంతరాలను అధిగమించి, పార్టీ కోసం శ్రమించారన్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం పార్టీ పటిష్టతకు సమష్టిగా పనిచేయాలన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించి, భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ టీడీపీ వైపే నిలిచేలా చూడాలన్నారు. ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, నేతలు అవినాశ్‌రెడ్డి, వెంకటాచలం, కడా పీఏసీ సభ్యుడు రఘు, మురళీ, ఆదిల్, రామకృష్ణప్ప, పద్మనాభరెడ్డి, కేశవరెడ్డి, సురేష్, సతీష్, మంజునాథ్, నరసింహులు, అంజి, శ్రీరాములు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ

బైరెడ్డిపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా పేర్కొన్నారు. మండలంలోని లక్కనపల్లెలో మంగళవారం వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీతో ఉలవలను రైతులకు పంపిణీచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల మండలాన్ని మదనపల్లె జిల్లాలో చేర్చాలి

రొంపిచెర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలాన్ని చిత్తూరు జిల్లా నుంచి మదనపల్లె జిల్లాలోకి మార్చాలని రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు రాజేంద్ర నాయుడు అన్నారు. మంగళవారం వారు రొంపిచెర్ల పంచాయతీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త జిల్లాల పునర్విభజనలో భాగంగా మదనపల్లె జిల్లా ఏర్పాటు కానుందన్నారు. రొంపిచెర్ల మండలం పుంగనూరు నియోజకవర్గంలో ఉందని, ఈ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మదనపల్లె జిల్లాలో ఉన్నాయన్నారు. అయితే రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలు చిత్తూరు జిల్లాలో ఉన్నాయని తెలిపారు. పీలేరు డివిజన్ ఏర్పాటు చేయనున్న తరుణంలో రొంపిచెర్ల మండలాన్ని ఆ డివిజన్‌లో చేర్చాలని వారు కోరారు. ఈసమస్యను పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈసమావేశంలో మొగల్ మహమ్మదాలిబేగ్, బీసీ నాయకుడు చిన్ననాగరాజ ఉపాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

పలమనేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని పలమనేరు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం సూచించారు. మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సీఆర్ఎంటీలకు మంగళవారం వారు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల యొక్క ప్రగతిని ప్రత్యేక ఫార్మేట్ ద్వారా పరిశీలించాలని సూచించారు. వారి విద్యాస్థాయిని పెంపొందించడానికి బోధన, అభ్యసన ప్రక్రియలో సమూల మార్పులు తీసుకురావాలన్నారు. ఆవిధంగా శిక్షణ తీసుకొన్న ప్రధానోపాధ్యాయులు వారివారి పరిధిలోగల పాఠశాలలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రధాన భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్స్ సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.


ప్రసవాలన్నీ ప్రభుత్వాస్పత్రిలోనే జరగాలి

కల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రసవాలకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా సిబ్బంది కృషి చేయాలని వైద్యాధికారులు వేణుగోపాల్ రెడ్డి, అపర్ణ తెలిపారు. పులిచెర్ల ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం డాక్టర్ అపర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రసవంలో గర్భిణి మౌనిక పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. డాక్టర్లు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించే ప్రసవాలతో తల్లీబిడ్డ క్షేమమని తెలిపారు. వైద్య సిబ్బంది శ్రీదేవి, ప్రమీల, రేవతి, ఫెమీలా, జుబీన్‌తాజ్, సుమిత్ర పాల్గొన్నారు. ● రొంపిచెర్ల (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు చిన్న పిల్లలకు ఆరోగ్యదాయకంగా పనిచేస్తాయని వైద్యాధికారి దినేష్‌కుమార్ చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు పరీక్షలు చేశారు. రక్తహీనత గుర్తించి మందులు ఇచ్చి పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్య వైద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో అమ్మణ్ణి, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు. ● గంగవరం (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు పాటిస్తూ, క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని గంగవరం పీహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ లహరి సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు రక్తపరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. ● బైరెడ్డిపల్లె (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని వైద్యాధికారి విజయచందర్ పంపిణీచేశారు. ప్రతినెలా గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మహతి ఫౌండేషన్ వారికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. మహతి ఫౌండేషన్ నిర్వాహకులు తిమ్మక్క, శ్రీనివాసులు, డాక్టర్ షాలిని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న మహతి ఫౌండేషన్ నిర్వాహకులు

ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తిచేయాలి



బొమ్మిదొడ్డి కాలనీలో నిర్మాణం పూర్తి కాని ఇళ్లు, లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను పేదలు వేగవంతంగా పూర్తిచేసుకోవాలని హౌసింగ్ పీడీ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం పలమనేరు మున్సిపాలిటిలోని బొమ్మిదొడ్డి సమీపంలోని కురప్పల్లి కాలనీ వద్ద లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకోసం ఇల్లు మంజూరు చేసి ఏళ్లు గడిచిపోతున్నా ఇప్పటికీ నిర్మాణం పూర్తిచేసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఇళ్లనిర్మాణం పూర్తిచేసుకోవాలని సూచించారు. పలమనేరు మున్సిపాలిటీలోని పేదలకోసం గడ్డూరులో 306, కురప్పల్లి వద్ద 1791 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో ఇప్పటి వరకు గడ్డూరులో 217, కురప్పల్లి కాలనీలో 936 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయని చెప్పారు. మిగిలినవాటిలో గడ్డూరులో 89 ఇళ్లు, కురప్పల్లికాలనీలో 855 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్స్‌లో ఉన్నాయన్నారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకొనేలా తగినచర్యలు తీసుకోవాలని హౌసింగ్ సిబ్బందిని పీడీ ఆదేశించారు. ఈకార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, హౌసింగ్ ఏఈ రామిరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తి,రక్తి,ముక్తిల సారమే భజగోవిందం


రాధా మనోహర్ దాస్

చిత్తూరు కల్చరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): భక్తిలేనిదే రక్తి లేదని ,రక్తి లేనిదే ముక్తి లేదని, ఈమూడింటి సారాంశమే భజగోవిందమని అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త రాధామనోహర్ దాస్ అన్నారు. స్థానిక నగర పాలక నాగయ్య కళాక్షేత్రంలో మంగళవారం రెండవరోజు ప్రవచనాలను వినిపించారు. పురాణ పుణ్య పురుషులంతా ప్రార్థనలను చేసి రక్తి కోసం ఐహిక జీవితం గడిపి, తద్వారా కష్టనష్టాలకు లోనై చివరకు భగవత్ ప్రార్థనతో ముక్తి పొందారన్నారు. దైవప్రార్థనలతో ఉపశమనం పొందవచ్చునన్నారు. భక్తులతో భజగోవిందం, శ్రీ రామభజన సామూహిక పారాయణం చేయించారు. కార్యక్రమంలో భాగంగా ఇస్కాన్ దివ్య ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ ప్రవచన కార్యక్రమం బుధ, గురవారాలు కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రవచనాలకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ


యూరియా కోసం వచ్చిన రైతులు

ఐరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరికీ యూరియాను అందిస్తామని మండల ఏవో సుధాకర్ రెడ్డి చెప్పారు. మంగళవారం వైఎస్.గేటు సచివాలయంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. తొలుతగా వంద మంది వరకు రైతులు సచివాలయానికి వచ్చారు. వచ్చిన రైతులు వారివారి పాసు బుక్కులను వరుస క్రమంలో పెట్టారు. రైతుల పాసు బుక్కులను పరిశీలించి వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. మరింత యూరియాను ప్రభుత్వం పంపనున్నట్లు తెలిపారు.

మణినాయుడికి బీజేపీ నాయకుల సన్మానం



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ చైర్మన్ మణి నాయుడిని మంగళవారం నియోజకవర్గ బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు,ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు సుజిత్‌రెడ్డి,కుమార్,జయచంద్రారెడ్డి,భానుప్రకాష్,అశోక్,గుణశేఖర్,మోహన్‌రెడ్డి,భాస్కర్‌నాయుడు,చిట్టిబాబు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): నగరంలోని వైష్ణ వాలయాల్లో ఈ నెల 16 నుంచి ధనుర్మాస పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక కోదండ రామాలయంలో గోదాదేవి విరచిత తిరుప్పావై పాశురాలు రోజుకొక పాశురాన్ని పారాయణం చేయనున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ నాయుడులు తెలియజేశారు.

మండల యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక


అరుణ్‌కుమార్-దేవరాజులు

ఐరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా జి.దేవరాజులు ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ సంఘ ఎన్నికలను ఆ సంఘ ఎన్నికల అధికారి రెడ్డెప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ మండల శాఖ గౌరవ అధ్యక్షుడిగా మోహన్,అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రభాకర్, మహిళా అధ్యక్షురాలిగా రాధిక,ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్, కోశాధికారిగా జనార్దన్, మండల కార్యదర్శులుగా గుణసుందరి,నాగరాజు,ప్రదీప్,సుధాకర్,వెంకటముని,మాధవరెడ్డి,మురుగేషన్, రవిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం పరిశీలించారు. ఉదయం పలమనేరు రోడ్డులో దర్గా సర్కిల్ నుంచి ఇరువారం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కన్నన్ కళాశాల వద్ద, ఇరువారం ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా జరుగుతున్నపనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

పాలసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాలనీ బస్టాప్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కాలనీకి చెందిన గోవిందరాజ్ బెల్టు షాప్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చింది. పోలీసులు వెళ్లి నిర్ధారించుకుని అతడిని అరెస్టు చేసి 50 క్వార్టర్ బాటిళ్లను స్వాధీన పరచుకుని కేసు నమోదు చేశారు. ఎక్కడైన అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఖోఖో సంఘ సంయుక్త కార్యదర్శిగా బాలాజి



చిత్తూరు క్రీడలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ఖోఖో సంఘ సంయుక్త కార్యదర్శిగా బాలాజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరులో ఏపీ ఖోఖో సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన బాలాజీని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పరీక్షా పే చర్చకు నమోదు చేసుకోండి

వెదురుకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్వేటినగరం డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డీకే దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రధానితో స్వయంగా మాట్లాడాలనుకుంటున్నారా? మీ తెలివైన ప్రశ్న ద్వారా కల నెరవేర్చుకునేందుకు ఇదో చక్కని వేదిక అని పేర్కొన్నారు. 6 నుంచి 12 తరగతులకు చెందిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఇది మంచి అవకాశమన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే జనవరి 11వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.. ఇతర వివరాలకు డైట్‌లో సంప్రదించాలన్నారు.

కంప్యూటర్ పరికరాల వితరణ



విజయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి ఆసాది రమేష్ మంగళవారం కంప్యూటర్ పరికరాలు వితరణ చేశారు. ఏడాది పాటు ఇంటర్నెట్ సదుపాయ మొత్తాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా దాతను ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు, ఉపాధ్యాయులు అభినందించారు. సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్, సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసీ చైర్మన్ చిన్నపాపయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 9మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన తొమ్మిది మందికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ చెప్పారు. రెండు రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. తొమ్మిది మంది మద్యం తాగి వాహనాలను నడిపినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వీరిని మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున జరిమానా విధించారని సీఐ వివరించారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

చిత్తూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిటీషన్లు వేయాలని కోరామన్నారు. ఉపాధ్యయుల ఆందోళన దృష్టిలో పెట్టుకుని తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేయాలని కోరుతున్నామన్నారు. ఆర్డీవో శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు సుధాకర్‌రెడ్డి, బాషా, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

20 మంది బాలికలకు సహకారం


విరాళం అందిస్తున్న గీతా రాఘవన్

నగరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సుకన్య సమృద్ధి పథకం ప్రోత్సాహానికి ఓ ఉద్యోగి ముందుకు వచ్చారు. మండల పరిధిలోని తడుకుపేటలో 20 మంది బాలికలకు సంబంధించి తొలినెల సొమ్మును తపాలా కార్యాలయానికి చెందిన గీతా రాఘవన్ స్వయంగా చెల్లించారు. దీనిని విరాళంగా అందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి పథకానికి సిబ్బంది ప్రోత్సాహక తీరును స్థానికులు అభినందించారు.

అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు


సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ గోపి

పూతలపట్టు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఎక్కడబడితే అక్కడ వాహనాలను నిలుపరాదని సీఐ గోపి చెప్పారు. పోలవరం వెళ్ళే రోడ్డుపై మంగళవారం వారపుసంత జరుగుతుంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ క్రమంలో సీఐగా బాధ్యతలు చేపట్టిన గోపి మంగళవారం వారపు సంతగేటు వద్ద ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టారు. వ్యాపారులు, వాహనదారులతో మాట్లాడారు. వాహనదారులు, ఆటో డ్రైవర్లు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగేలా వాహనాలను ఆపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదలకు భోజన పొట్లాల పంపిణీ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో మాస నారాయణీ సేవలో భాగంగా మంగళవారం సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిరు పేదలకు భోజన పొట్లాలపే పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ ఆర్ ప్రభాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్టోర్ రూము కాదు..ఆపరేషన్ థియేటర్!

● పచ్చికాపల్లం పీహెచ్‌సీలో వసతుల కొరత



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వెదురుకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సమస్యలు చుట్టుముట్లాయి. పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఆపరేషన్ గదిలో మౌలిక వసతులు కొరవడ్డాయి. ఫలితంగా ఏళ్ల తరబడి శస్త్రచికిత్సలు చేయడంలేదనే విమర్శలున్నాయి. ఆపరేషన్ గదిని కుర్చీలు, ఇతర సామగ్రి నిల్వ గదిగా మార్చేశారని తెలిసింది. ఈ కేంద్రంలో ఐదు పడకలున్నాయి. స్థాయి పెంచుతామంటున్న ప్రజా ప్రతినిధుల హామీ కార్యరూపం దాల్చడంలేదు. అత్యవసర కేసులను కింది స్థాయి సిబ్బంది చూసి తిరుపతికి రెఫర్ చేస్తారంటున్నారు. ప్రసవాలకు వచ్చిన వారిని కూడా స్టాఫ్ నర్సు లేదా ఇతర ఉద్యోగి చూసి రెఫర్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు ఉద్యోగులు కొందరు స్థానికంగా ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కొరత కూడా ఉందని రోగులు తెలిపారు. . ఆస్పత్రి ఆవరణలో (ప్రహరీలోపల) పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీనివల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయని రోగులు వాపోతున్నారు. కాగా తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కేసులు తిరుపతి రెఫర్ చేస్తున్నామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణచైతన్య చెప్పారు.వైద్య సేవలు బాగానే అందుతున్నాయన్నారు.


ఆస్పత్రి సామగ్రికి వాడుతున్న ఆపరేషన్ గది

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న క్రిష్ణంపల్లి పంచాయతీ,ఎర్రచేను గ్రామానికి చెందిన గజేంద్ర రెడ్డికి రూ.51,840, దయానంద రెడ్డికి రూ.1,16,175 చెక్కులను అందజేశారు. మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రబీ, నాయకులు రవీంద్ర రాజు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి


గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ ప్రియాంక

పూతలపట్టు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక కోరారు. పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం గర్భిణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లనుంచి అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆలయానికి పాలకమండలి ఎన్నిక


కన్యకాపరమేశ్వరి నూతన కమిటీ సభ్యులు

నగరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయానికి పాలక మండలిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా రొక్కం బాబు, అధ్యక్షుడిగా బ్రహ్మానందం, ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా మాదాళం శ్రీరామ్‌బాబు, ఉప కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా కోటేశ్వరరావు, కార్య నిర్వాహక సభ్యులుగా చంద్రశేఖర్ గుప్తా, డిల్లీబాబు, సత్యనారాయణ, అరుణ్‌కుమార్, డిల్లీ అజయ్, భాస్కర్, లీగల్ అడ్వయిజర్స్‌గా చిరంజీవులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను సత్కరించారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ


మహిళ సమస్యను వింటున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ అన్నారు. మంగళవారంకురివికుప్పంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరచడమే ధ్యేయమన్నారు. ఎమ్మెల్యేని పార్టీ శ్రేణులు సత్కరించాయి. పచ్చికాపల్లం గ్రామ పంచాయతీ పరిధిలోని బొమ్మనదొడ్ల, నక్కలాంపల్లి వద్ద సిమెంటు రోడ్ల ప్రారంభోత్సవాలు చేశారు. ప్రజల వినతులను స్వీకరించారు.

డ్రైనేజీలో తాగునీటి పైపులైన్



పెనుమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామక్రిష్ణాపురం పంచాయతీ బి.అగ్రహారం గ్రామంలో డ్రైనేజీ కాలువలోనే తాగునీటి పైపులైన్ కలవడం కలవరపరుస్తోంది. దీనిపై గ్రామస్తులు ఆందోళన చెందున్నారు.. పైపులైన్ ప్రమాదవశాత్తు లీక్ అయితే డ్రైన్ నీరు అందులో కలిసే అవకాశముందంటున్నారు. విడిగా పైపులైన్‌అమర్చాలని కోరుతున్నారు.

మూడు నెలలకే రోడ్డు మధ్య గొయ్యి



ఐరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వేసిన మూడు నెలలకే నడి రోడ్డులో ఓ గొయ్యి ఏర్పడింది. ఈ మార్గంలో నిత్యం అధికారులు,నాయకులు, పాఠశాల, కాలేజీ విద్యార్థులు,పీలేరు వైపు నుంచి కాణిపాకానికి భక్తులు ప్రయాణిస్తుంటారు. ఈ మధ్య ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టారు. రోడ్డు బాగానే ఉన్నా ఐరాలకు కూతవేటు దూరంలోని రెడ్డివారిపల్లె వద్ద మాత్రం కుచించకు పోయింది. ఈ మార్గంలో కాణిపాకం వేళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

బంగారమ్మకు పూజలు

వెదురుకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు విశేష అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమ అభిషేకం చేశారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మకర్త ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

వెదురుకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):సీఆర్‌కండ్రిగ కాలనీలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త దయానందం(44)కి ఎమ్మెల్యే థామస్ సంతాపం ప్రకటించారు. మంగళవారం వెళ్లి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

బస్సు సౌకర్యంపై వినతి

నగరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నింద్ర, విజయపురం మండలాల నుంచి చిత్తూరుకు ఒకే ఒక బస్సు మాత్రమే ఉందని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. వారు మంగళవారం పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు గతంలో నగరి-వేలూరు, సత్యవేడు-బెంగళూరు బస్సు ఉందని, అది ఉదయం వెళ్లిపోతే తిరిగి చిత్తూరుకు వెళ్లడానికి బస్సు లేదన్నారు. స్పందించిన డిపో మేనేజర్ స్పందిస్తూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్సులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. సీపీఐ కార్యదర్శి కోదండయ్య, మునిరత్నం నాయుడు, కుప్పయ్య శెట్టి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

నగరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన నగరి మున్సిపాలిటీకి చెందిన కరుణ విజయవాడలో సోమవారం ప్రమాణ స్వీకారం చేసే బాధ్యతలు చేపట్టారు. నగరి మున్సిపాలిటీ టీడీపీ కార్యదర్శి శ్రీనివాస్ నాయకులు మదివన్నం మాణిక్యవాసం పలువురు మొదలియార్‌లు విజయవాడకు తరలి వెళ్లి ఆయనను సన్మానించారు.

గర్భిణులకు పౌష్టికాహారమే రక్ష


సూచనలిస్తున్న గుడిపాల వైద్యాధికారి సంధ్య

గుడిపాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అన్నివిధాలా ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి సంధ్య అన్నారు. మంగళవారం గుడిపాల ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ బాలసూర్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కాలువల మరమ్మతులు చేపట్టండి: ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

తవణంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెరువులకు నీళ్ల వచ్చే (సప్లై చానల్‌లు) కాలువలను శుభ్రపర్చి సుబ్రపరిచి మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి ఇరిగేషన్‌శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో వర్షాలు కురిసి వంకలు, వాగులు ప్రవహిస్తున్నా సప్లై చానల్‌లు సక్రమంగా లేకపోవడంతో కొన్ని చెరువులకు నీరు చేరలేదన్నారు. సప్లై చానల్‌కు మరమ్మతులు చేసి చెరువులకు నీళ్లు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గత మూడు నెలలుగా మండలంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శాఖల వారిగా సమీక్షించారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్... తాగు నీరు వృథా


వృథాగా పోతున్న ఎన్టీయార్ జలాశయ నీరు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర ప్రజల దాహర్తి కోసం ఏర్పాటు చేసిన ఎన్టీయార్ జలాశయం నుంచి వచ్చే ఓ పైపులైన్ పగిలిపోయింది. దాంతో జలాశయం నీరు మురికికాలువలోకి పోతోంది. మురికికాలువ నీరు పైపులైన్‌లో కలిస్తే రోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. పెనుమూరు మండల పరిధిలోని ఎన్టీయార్ జలాశయం నుంచి నీటిని చిత్తూరు ప్రజల దాహర్తిని తీర్చడానికి పైపులైన్ల ద్వారా తీసుకొస్తున్నారు. పైపులైన్ల ద్వారా వచ్చేనీటిని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన పెద్దపెద్ద సంపుల్లో నింపుకుని అక్కడి నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు కొళాయిల ద్వారా నీటిని అందిస్తారు. జలాశయం నుంచి వచ్చే పైపులైన్ ఓవర్ బ్రిడ్జి కిందిభాగం నుంచి టీటీడీ కల్యాణ మండపం వద్ద నిర్మించిన సంపులోకి వెళుతోంది. కొన్ని రోజుల వరకు బాగానే ఉన్న ఈ పైపులైన్ ఇటీవల మరమ్మతుకు గురైంది. దీంతో నీరు మురుగుకాలువలో పోతుంది. కింద పైపులైన్.. పక్కనే మురికికాలువ ఉంది. పైపులైన్‌లో ఒత్తిడి పెరిగి ఎక్కువై మురుగునీరంతా పైపులైన్‌లో వెళితే ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. నగరపాలక అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.